

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ 18వ బ్యాచ్ శిక్షణకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. లైట్ వెహికల్ లైసెన్స్‌తో పాటు ఏడాది పాటు డ్రైవింగ్ అనుభవం కలిగి ఉన్న వారు ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 21 ఏళ్లు నిండిన వారు హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు అర్హులని స్పష్టం చేశారు. 40 రోజుల పాటు శిక్షణ ఉంటుందని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 8074640792, 7382923293 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మీ త్యాగం అజరామరం



తమ కోసం బతికేవాడు కాదు.. పది మంది కోసం ప్రాణాలర్పించే వాడే నిజమైన అమరుడు..! విధి నిర్వహణలో ప్రాణాలు సైతం లెక్క చేయక, ప్రజల భద్రత కోసం అహర్నిశలూ శ్రమించే వాడే జవాను. తీవ్రవాదులు పెచ్చరిల్లినా.. ముష్కరులు విరుచుకుపడినా.. శత్రు దేశాలు దండెత్తినా.. మడమ తిప్పక పోరాడే రక్షక భటునికి సలాం చేయాల్సిందే. అలా పలు పోరాటాల్లో అశువులు బాసిన జిల్లాకు చెందిన పలువురు అమరవీరులను ఈ రోజున స్మరించుకుంటూ ప్రత్యేక కథనం.
- ప్రజాశక్తి, శ్రీకాకుళం

నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

సంస్మరణ దినోత్సవం ఆవిర్భవించిందిలా..

1959 సంవత్సరం అక్టోబరు 21న భారత్- చైనాల మధ్య సియాచిన్ సరిహద్దులో లఢక్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న మన జవాన్లపై చైనా జవాన్లు దాడి చేయడంతో పది మంది అమర వీరులయ్యారు. నాటి నుంచి ఏటా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరపుకోవడం ఆనవాయితీగా మారింది.

పేదింట పుట్టి...



పొందూరు మండలంలోని లోలుగు గ్రామంలో 1976 ఏప్రిల్ 15న మజ్జి చిన్నవాడు దంపతులకు ఎస్.వి రమణ జన్మించాడు. వారిది నిరుపేద కుటుంబం. 1998 సంవత్సరం సెప్టెంబరు ఒకటో తేదీన కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి, స్పెషల్ పార్టీలో చురుకైన విధులు నిర్వహిస్తూ ఉన్నతాధికారుల మన్ననలు పొందాడు. నులకజోడు గ్రామంలో సుమారు 200 మంది నక్సలైట్లు రైసు మిల్లులో దోపిడీ చేసి బియ్యం బస్తాలు ఎత్తుకెళ్లిపోయారు. దానిపై కూంబింగ్‌కు వెళ్లిన స్పెషల్ పార్టీకి చేదు అనుభవం ఎదురైంది. 2001 సంవత్సరం అక్టోబరు 27న నడిమి గూడ వద్ద నక్సల్స్ అమర్చిన మందుపాతర పేలి వెంకటరమణ మృతిచెందాడు.

నక్సలైట్ల వేటలో...



జిల్లా చరిత్రలో తొలిసారిగా 1992 సంవత్సరంలో నక్సల్స్ ఘాతకానికి ఎస్ఐ బంగారు నాయుడు బలయ్యాడు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం గుణుపూరుపేటకు చెందిన ఆయన బారువా, కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో పనిచేశారు. మందస మండలం రట్టి, బేతాళపురం గ్రామాల మధ్య కొండల్లో నక్సలైట్లు ఉన్నారనే సమాచారం రావడంతో అక్కడకు వెళ్లారు. మార్చి 23వ తేదీన ఉద్దానం దళానికి చెందిన నక్సలైట్లు జరిపిన కాల్పుల్లో మృతి చెందాడు.

సమాచార సేకరణలో దిట్ట



నక్సలైట్ల సమాచార సేకరణలో దిట్టగా పేరుగాంచిన నరేంద్రదాసు, వారి ఉద్యమాలను నీరుగార్చేందుకు విశేషమైన కృషి చేసేవాడు. నక్సలైట్ల కదలికలను గమనించి, వారి ఆకృత్యాలను నిరోధించడంలో దాసు సఫలమవుతుండటాన్ని నక్సల్స్ సహించలేకపోయారు. 1997 మార్చి 17వ తేదీన కాశాబుగ్గలో దైవదర్శనానికి వెళ్లిన దాసును పిస్టోల్‌తో కాల్చి చంపారు. 1971లో పోలీసుశాఖలో చేరిన దాసు స్పెషల్ బ్రాంచి ఇంటెలిజెన్స్ విభాగాల్లో సమర్థవంతమైన సేవలు అందించారు.

రక్షణ కల్పిస్తూ ప్రాణాలు వదిలి..



పలాస మండలం నీలిభద్రలో ఒక వ్యక్తిని హతమార్చి, ఆస్తిని దోచుకునేందుకు నక్సలైట్లు ప్రణాళిక వేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆయనను రక్షించేందుకు ఇంటి వద్ద పికెట్ ఏర్పాటు చేశారు. దానికి ఇన్‌ఛార్జిగా హెడ్‌కానిస్టేబుల్‌గా అన్నెపు పాపారావు వ్యవహరించారు. 1997 జూలై 17వ తేదీ అర్ధరాత్రి తుపాకీలతో నక్సలైట్లు విరుచుకుపడ్డారు. పాపారావు ఎదురుకాల్పులు జరిపి, వీరోచితంగా పోరాడాడు. నక్సల్స్ తూటాలకు నేలకొరిగాడు. 1971 పోలీసు శాఖలో పాపారావు సర్వీసు ప్రారంభించారు. 1948లో ఫిబ్రవరి 9వ తేదిన కోటబొమ్మాళి మండలం జర్జంగిలో జన్మించారు.

దారికాచి మట్టుబెట్టారు



నక్సలైట్ల కార్యకలాపాల సమాచార సేకరణలో ఆరితేరిన కృష్ణమూర్తిని దారికాచి మట్టుపెట్టారు. 1970 మార్చి 15న సంతకవిటి మండలం వాల్తేరులో పి.బోడయ్య దంపతులకు కృష్ణమూర్తి జన్మించాడు. 1993లో కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరాడు. నక్సలైట్ల ఏరివేతలో చురుకైన పాత్ర పోషిస్తూ శాంతి భద్రతలను పరిరక్షించేవాడు. దీన్ని జీర్ణించుకోలేని నక్సలైట్లు మాటువేసి కాల్చి చంపారు. 2000 సంవత్సరం జూన్ 5న మందస మండలం, హరిపురం కూడలిలో ఈ ఘాతుకం చోటుచేసుకుంది.



నూతన కార్యవర్గ సభ్యులతో ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కమిటీ ఎన్నిక

కన్వీనర్‌గా పవిత్ర

శ్రీకాకుళం అర్బన్: ఎస్ఎఫ్ఐ గర్ల్స్ విభాగం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో గర్ల్స్ విభాగం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. జిల్లా కన్వీనర్‌గా పి.పవిత్ర, కో-కన్వీన ర్లుగా మోహిని, దివ్య, భవాని, శ్రావణి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమాల్లో బాలికల పాత్ర ఎంతో కీలకమన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యా విధానాన్ని అడ్డుకోకపోతే మహిళల విద్య ప్రశ్నార్థకం కానుందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యారంగానికి ప్రమాదకర నూతన విద్యా విధానాన్ని శరవేగంగా అమలు చేస్తున్నాయని చెప్పారు. దీనివల్ల విద్యార్థుల భవిష్యత్ అంధకారంలోకి నెట్టబడుతోందన్నారు. బాలికా విద్య తిరోగమనంలోకి చేరి ఆడపిల్లలు మళ్లీ వంటింటికే పరిమితమయ్యే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. మహిళలు, బాలికల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు ఇచ్చే హామీలన్నీ వాగ్దానాలు గానే మిగిలిపోతున్నాయన్నారు. బాలికల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో విద్యార్థినుల హక్కుల సాధనకు జిల్లా గర్ల్స్ కన్వెన్షన్ నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థినుల సమస్యలపై తమంతట తామే పోరాడే విధంగా వారిని చైతన్యపరుస్తున్నామన్నారు. విద్యా రంగంలోని సమస్యలు, విద్యార్థుల హక్కుల కోసం ఎస్ఎఫ్ఐ మాత్రమే పోరాడుతోందన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సిహెచ్.రాజు, ఎం.సంతోష్, ఖగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక

టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చిందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ తెలిపారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల జగన్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఇసుక అందకుండా చేసి అడ్డగోలుగా బినామీ కంపెనీలతో దోచుకున్నారని విమర్శించారు. నిర్మాణ రంగాన్ని పూర్తిగా దెబ్బతీసి నది ఒడ్డున నివాసముంటున్న వారు సైతం రూ.వేలల్లో ఖర్చు చేసి ఇసుక పొందే విధానాన్ని అమలు చేశారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ ఇసుక విధానంతో నిర్మాణ రంగం కుదేలైందని విమర్శించారు. నిర్మాణ రంగ కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడ్డారని చెప్పారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఉచిత ఇసుక విధానాన్ని ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ ఘనత చంద్రబాబుకే సాధ్యమైందన్నారు. ఇసుక అందుబాటులోకి రావడంతో బడుగు, బలహీన, కార్మికులకు ఎంతో మేలు చేకూరిందన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

'పల్లె పండగ'తో గ్రామాలకు మహర్దశ

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

పల్లె పండగతో పల్లెలకు మహర్దశ రానుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని రాగోలు, గూడెం, వాకలవలస, లంకాం, ఒప్పంగి, సానివాడలో అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమపై పెంచుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పల్లె ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. ఏ గ్రామంలో ఏ పనులు అవసరమో వాటిని పూర్తి చేసేందుకు అందుకు తగ్గ నిధులు విడుదల చేశామన్నారు. మంచి పాలన అందించడమే లక్ష్యమని, అందుకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో మౌలిక సదుపాయాలు పెద్దఎత్తున కల్పించేందుకు మునుపెన్నడూ జరగని విధంగా గ్రామ పంచాయతీల అభివృద్ధికి వారం రోజుల పాటు నిర్వహించనున్న పల్లె పండగ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో సిసిరోడ్లు, బిటి రోడ్లు, నీటి సంరక్షణ ట్రెంచులు, గోకులాలను పెద్దఎత్తున అన్ని గ్రామాల్లో నిర్మిస్తామన్నారు. ఉపాధి నిధులతో నియోజకవర్గంలో పెద్దఎత్తున అభివద్ధి పనులు చేస్తామన్నారు. మంచి కార్యక్రమాన్ని రూపుదిద్దిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవణ్ కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సంక్షేమ పాలనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తూ పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించే దిశగా కృషి చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బొడ్డేపల్లి శైలజ, టిడిపి నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ అరెస్టు

- ఎనిమిదిన్నర తులాల బంగారం రికవరీ-
- డిఎస్‌పి సిహెచ్.వివేకానంద

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని అరసవల్లి రోడ్డులో ఈనెల 11న ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును తెంపి పరారైన విశాఖపట్నంలోని కంచరపాలెంకు చెందిన చైన్ స్నాచర్ కమలనాథ్‌ను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి సిహెచ్.వివేకానంద తెలిపారు. నగరంలోని డిఎస్‌పి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. నిందితుడు 2009 నుంచి నేర ప్రవృత్తికి అలవాటు పడి చైన్ స్నాచింగ్, బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నాడు.

వృత్తిరీత్యా బైక్ మెకానిక్ అయిన కమలనాథ్‌కు రాష్ట్రవ్యాప్తంగా 30 నేరాలతో సంబంధం ఉంది. నిందితుడు ఈనెల 4న విశాఖ జైలు నుంచి బెయిల్ పై విడుదలయ్యాక విజయనగరం జిల్లా డెంకాడ, తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు, నగరంలోని అరసవల్లిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు తెలిపారు. అతన్ని పట్టుకుని విచారణ చేసిన తర్వాత విశాఖలోని మురళీ నగర్ ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టిన ఎనిమిదిన్నర తులాల బంగారాన్ని రికవరీ చేసినట్లు చెప్పారు. సాంకేతిక ఆధారాలతో నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న వన్‌టౌన్ సిఐ పైడపునాయుడు, ఎస్ఐ, సిబ్బందిని అభినందించారు. వరుస నేరాలకు పాల్పడుతున్న పాత నేరస్తుల కదలికలపై నిఘా పెంచామని, రాత్రివేళ గస్తీ ముమ్మరం చేసినట్లు తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి వివేకానంద

భారీ వర్షాలపై అప్రమత్తం

- జిల్లాస్థాయిలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం



బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఈనెల 24, 25 తేదీల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లా ఉన్నతాధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పలు శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో మైనర్ ఇరిగేషన్ పరిధిలోని ట్యాంకులన్నీ పరిశీలించాలని, ఎక్కడైనా ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉంటే వాటిని గుర్తించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాస్థాయిలో కంట్రోల్‌రూమ్‌కు సంబంధించి ఏర్పాటు చేసిన ఫోన్ నంబరు 08942 240557 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోషల్, బిసి వెల్ఫేర్, ఇతర హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు హాస్టల్ వదిలి బయటకు రాకూడదన్నారు. జిల్లాలోని నదీ ప్రవాహాలకు సంబంధించిన నివేదికలను ఎప్పటిప్పుడు తెలియజేయాలన్నారు. మండలస్థాయిలో రిలీఫ్ క్యాంపులను ఏర్పాటు చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి అక్కడ విఆర్‌ఒలను అప్రమత్తంగా ఉంచాలని, కార్పొరేషన్, మున్సిపాల్టీలో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అవసరమైతే మోటార్లతో నీటిని తోడివేయాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ పోల్స్, వైర్లు పడిపోయాయా అనేది ఎప్పటికప్పుడు చూసుకుని వాటిని తొలగించి, వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడా పశువులు, గొర్రెలకు ప్రాణ నష్టం సంభవించకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్ ద్వారా సమీక్షించాలన్నారు. ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు జెసిబిలను, జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. మొబైల్ టవర్స్ నిర్వాహకులు జనరేటర్లకు డీజిల్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మత్స్యకారులను సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదని, సముద్రంలో ఉన్న వారు ఒడ్డుకు చేరుకోవాలని తెలిపారు. బాగా లేని పాఠశాలలు, హాస్టల్స్ భవనాలు సమీపంలోని మంచి భవనంలోకి మార్పు చేయాలని, లేకుంటే పిల్లలను ఇళ్లకు పంపించాలన్నారు. నిర్వాసితుల కోసం పాఠశాల భవనాలు అవసరమైతే తహశీల్దార్ అనుమతితో విఆర్‌ఒలకు అందజేయాలని స్పష్టం చేశారు. ఈనెల 21వ తేదీ నుంచి అధికారులు వారి పనిచేసే ప్రదేశంలోనే అందుబాటులో ఉండాలన్నారు. వర్షపాతం ఎక్కువగా ఉన్నప్పుడు కాజ్‌వేలపై నీరు ప్రవహిస్తున్నప్పుడు అక్కడ విఆర్ఒ, కానిస్టేబుల్‌ను ఉంచాలన్నారు. అవసరమైతే బ్యారికేడ్స్ రహదారికి అడ్డంగా వేయాలన్నారు. ముందస్తుగా పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక, ఆర్‌అండ్‌బి అధికారులు అవసరమైన యంత్ర పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.



రామారావు మృతదేహం



భవ్య (ఫైల్)

లారీ ఢీకొని ఇద్దరు మృతి

జిల్లేడువలసలో విషాదం

ప్రజాశక్తి- నరసన్నపేట/పోలాకి

నరసన్నపేట జాతీయ రహదారిపై లారీ ఢీకొని ఇద్దరు వ్యక్తులు సంఘటనా స్థలంలోనే మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోలాకి మండలం జిల్లేడువలసకు చెందిన నక్క రామారావు (45), అదే గ్రామానికి చెందిన తియ్యల భవ్య (16) ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం బంధువుల శుభకార్యానికి వెళ్లారు. తిరిగి 4 గంటల సమయంలో శ్రీకాకుళం నుంచి స్వగ్రామం ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. మార్గంమధ్యంలో సత్యవరం వద్ద జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ బైక్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడకి అక్కడే మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న రెండు కుటుంబ సభ్యులు ఘటనాస్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రామారావుకు భార్య ముత్యాలు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడు వ్యవసాయ కూలి. భవ్యకు తల్లిదండ్రులు గౌరీష్, నర్సమ్మ, అన్నయ్య ఉన్నారు. భవ్య నరసన్నపేటలోని ప్రయివేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుంది.



జ్యూట్ ఉత్పత్తులను పరిశీలిస్తున్న కిరణ్ కుమార్

ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలి

డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్

ప్రజాశక్తి - లావేరు


స్వయంశక్తి సంఘాల్లోని ప్రతి మహిళా సభ్యురాలు పారిశ్రామికవేత్తగా ఎదగాలని డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని బెజ్జిపురం, బుడతవలసలో ఎంఎస్ఎంఇ ఒఎన్‌డిసి ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ ప్రోగ్రాంలో భాగంగా ఆదివారం పర్యటించారు. బెజ్జిపురం యూత్ క్లబ్‌లోని గోగునారతో తయారు చేసే వస్తువులను, బుడతవలసలో రైస్ మిల్లును పరిశీలించారు. జ్యూట్ ఉత్పత్తుల గురించి యూత్ క్లబ్ ప్రతినిధులు గంట్యాడ అప్పలనాయుడు, ఇజ్జాడ అప్పారావు, ఎం.రామారావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయంశక్తి సంఘాలు తయారు చేసే ఉత్పత్తులను ఒఎన్‌డిసిలో చేర్చినట్లు తెలిపారు. స్వయంశక్తి సంఘాల సభ్యులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.పది లక్షల నుంచి రూ.కోటి వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇందులో కొంతమేర రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. తద్వారా పది కుటుంబాలకు ఉపాధి కల్పించడంతో పాటు తమ కాళ్లపై తాము నిలబడేందుకు అవకాశం కలుగుతుందన్నారు. చిన్న చిన్న పరిశ్రమలు స్థాపించి అభివృద్ధిపథాన నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిపిఎం ఎల్.హెచ్.బి నారాయణరావు, ఎపిఎం బి.వి సుబ్బయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు కానిస్టేబుల్ విధులు కీలకం

- శిక్షల శాతం పెరిగేలా కృషి చేయాలి
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శిక్షల శాతం పెరిగేందుకు కోర్టు కానిస్టేబుల్ విధులే కీలకమని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. కోర్టు విధుల్లో భాగంగా ప్రతిఒక్కరూ బాధ్యత, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్ల వారీ కోర్టు కానిస్టేబుల్, కోర్టు (లైజన్) సమన్వయ సిబ్బందితో కోర్టు కేసుల విచారణ, సమన్లు, వారంట్ల అమలు, సాక్షులను కోర్టులో హాజరుపరచడం, కేసు అభియోగ పత్రాల దాఖలు, పలు దశల్లో ఎదురవుతున్న సమస్యలు, ఇతరత్రా అంశాలపై జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్లు, న్యాయస్థానాల మధ్య అనుసంధానంగా వ్యవహరిస్తూ అంకితభావంతో పనిచేస్తూ శిక్షల శాతం పెంచే విధంగా శ్రమించాలన్నారు. నాన్ బెయిలబుల్ వారెంట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్దేశించిన సమయంలో తగ్గించాలన్నారు. కేసుల విచారణ సమయంలో సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ల వద్ద ప్రవేశపెట్టి బ్రీఫింగ్ ఇవ్వాలన్నారు. పోలీసుల అలసత్వం వల్ల కోర్టులో విచారణ పెండింగ్ కేసులు లేకుండా కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు మానిటరింగ్ సిస్టమ్ వారు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి కేసు విచారణకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసు విచారణ సమయంలో సాక్షులు, సాక్ష్యాధారాలు, రికార్డులను కోర్టు కానిస్టేబుళ్లు కోర్టులో పొందుపరచాలన్నారు. దర్యాప్తు అధికారులు కేసు విచారణకు హాజరయ్యేలా కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు మానిటరింగ్ సిస్టం బాధ్యతాయుతంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అభియోగ పత్రాల దాఖల్లో ప్రతిని క్షుణ్ణంగా పరిశీలించి సక్రమంగా దాఖలు చేయాలని కోర్టు మానిటరింగ్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ఎస్ఐ పారినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

పునరావాసంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డ్వామా పీడీ బి.సుధాకరరావు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

తుపాను సమయాల్లో తీరప్రాంత ప్రజలను తుపాను రక్షిత భవనాలకు తరలించేందుకు అవసరమైన అన్నిరకాల చర్యలు చేపట్టాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు, మండల ప్రత్యేకాధికారి బి.సుధాకరరావు అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, ఇతర ప్రభుత్వ భవనాల్లో ప్రజలకు ఆశ్రయం కల్పించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. పురవాస చర్యలపై నిర్లక్ష్యం వహిస్తే తదుపరి చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మండలంలోని బొంతలకోడూరు పంచాయతీ పరిధి దిబ్బలపాలెంలోని తుపాను రక్షిత భవనాలను ఆదివారం పరిశీలించారు. తుపాను రక్షిత భవనాల్లో వసతులను మెరుగుపరచాలన్నారు. భవనాల్లో ప్రజలు ఉండేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను ఎప్పటిప్పుడు అమలు చేయాలని సూచించారు. ఆయన వెంట మండల అధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



తుపాను రక్షిత భవనాన్ని పరిశీలిస్తున్న సుధాకరరావు

ప్రజాశక్తి
www.prajasakti.com

‘అమ్మోజీ’కి వరల్డ్ రికార్డులో చోటు


అమ్మోజీని సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి- రణస్థలం

వర్ధమాన రచయిత్రి, కొష్ట సచివాలయ మహిళా పోలీస్ బమ్మిడి అమ్మోజీ నాలుగు వరల్డ్ రికార్డుల్లో చోటు దక్కించుకున్నారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4 నుంచి ఆదివారం సాయంత్రం 4 వరకు నిర్విరామంగా తాడేపల్లి గూడెంలో నిర్వహించిన ప్రపంచ తెలుగు కళా జాతరలో ఆమె భాగస్వాములయ్యారు. ఈ నేపథ్యంలో ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డ్సు, కల్చరల్ టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్సు, తెలుగు నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో ఆమె పేరు నమోదు అయిందని నిర్వాహకులు కట్టిమండ ప్రతాప్, కన్వీనర్ కొల్లి రమావతి తెలిపారు. వరల్డ్ రికార్డు నమోదు ప్రతినిధులు ఆదివారం సాయంత్రం అమ్మోజీకి ధ్రువీకరణ పత్రాన్ని, షీల్డ్‌ను ఆదివారం అందజేసి సత్కరించారు. టెక్కలి మండలం పోలవరానికి చెందిన అమ్మోజీ మండలం కొష్ట సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అమ్మోజీ ‘అమ్ము’ కలం పేరుతో రచనలు చేయడంతో పాటు సామాజిక సేవలోను కృషి చేస్తూ ఇప్పటికే పలు జాతీయ స్థాయి అవార్డులు సొంతం చేసుకున్నారు.


పురస్కారాన్ని అందుకుంటున్న కృష్ణమూర్తి

‘తెప్పల’కు పురస్కారం

ప్రజాశక్తి- పలాస

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెం బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో శ్రీశ్రీ కళా వేదిక 140వ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19, 20 తేదీల్లో ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతర పేరుతో శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు.పలాసకు చెందిన రచయిత, నటులు, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు తెప్పల కృష్ణమూర్తి కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. తరగని ఆస్తులు - మన సంప్రదాయాలు అను అంశంపై కవితా గానం చేసి ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షులు ఈశ్వరీ భూషణ్, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ టి.పార్థసారథి, రమావతిలు కృష్ణమూర్తికి శ్రీశ్రీ కళా వేదిక పురస్కారం అందజేశారు. జ్ఞాపికలను అందజేస్తూ... దుశ్శాలువ కప్పి ప్రశంసాపత్రం అందజేశారు. కృష్ణమూర్తికి స్థానిక సాహితీ వేత్తలు, కళాకారులు, అభిమానులు అభినందనలు తెలిపారు.


పురస్కారాన్ని అందుకుంటున్న దుర్గాప్రసాద్

దుర్గాప్రసాద్‌కు ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి- నరసన్నపేట

స్థానిక పద్మావతి విద్యా సంస్థల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ అబ్దుల్ కలాం జాతీయ పురస్కారం అందుకున్నారు. విద్యారంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా సదరన్ ప్రయివేట్ టీచర్స్ ఆర్గనైజేషన్ సంస్థ ఈ పురస్కారాన్ని అందజేసింది. గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే అబ్దుల్ నజీర్, గుంటూరు ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, క్రిస్టియన్ కళాశాల ప్రిన్సిపాల్ మోజీస్ పాల్గొన్నారు. దుర్గాప్రసాద్‌ను పద్మావతి కళాశాల చైర్మన్ పల్లి సూరిబాబు, అధ్యాపకులు అభినందించారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న నాయక్

‘దుర్దశ’ నాటికకు ఉత్తమ బహుమతి

పలాస: తాడేపల్లిగూడెంలో ప్రపంచ కళాజాతర బుద్దాల కాన్వెంక్షన్ హాల్‌లో శ్రీశ్రీ కళావేదిక సౌజన్యంతో నిర్వహించిన దుర్దశ ఒడియా నాటిక ఉత్తమ బహుమతి కైవసం చేసుకుంది. వరల్డ్ రికార్డు బుక్కులో నాటికను నమోదు చేశారని డాక్టర్ కుమార్ నాయక్ తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతి నాయకుని అవార్డును తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసరావు, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ తనకు అవార్డు ప్రదానం చేశారని నాయక్ తెలిపారు. డాక్టర్ తిరుపతి సాహూ రచనా దర్శకత్వంలో సాగిన ఈ నాటికలో డాక్టర్ కుమార్ నాయక్, భంజదేవ్ సమంతా, కుర గౌడ, రోషన్ సుభాష్ షా హో, చందమామ నటించారు. ప్లే బ్యాక్ సింగర్‌గా రమేష్ స్వాయి ప్రదీప్ ప్రధాన్, టున్న భాయ్ పాల్గొన్నారు. అనంతరం కుమార్ నాయక్‌కు దుశ్శాలువతో సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు.


ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

మదన్‌కు అండగా...

కవిటి: తలసేమియా వ్యాధితో (రక్తహీనత) బాధపడుతున్న మండలంలోని బట్టివాని పాలెంకు చెందిన చీకటి మదన్‌కు దాతలు అండగా నిలు స్తున్నారు. మదన్ వైద్యం కోసం అవసరమైన నగదు అందిస్తున్నారు. అందులో భాగ ంగా చిన్న కర్రివాని పాలెంకు చెందిన భగత్ సింగ్ సేవా సంఘం రూ. 13,100లు, చింతామణి సీ ఫుడ్స్ యునియన్ సభ్యులు రూ. 10 వేలు, మదన్ తండ్రితో 2014లో జగతిలో పదో తరగతి చదివిన స్నేహి తులు రూ.10,100లు అందించారు. గ్రామపెద్దలు, యువత పాల్గొన్నారు.

మెట్టక్కివలసలో అన్నదానం

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని మెట్టక్కివలస ప్రధాన రహదారి కొత్త అగ్రహారం వద్ద ఆదివారం భారీ అన్నదానం కార్యక్రమం కమిటీ సభ్యుడు నాగళ్ల మురళీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో దుర్గాదేవి కమిటీ సభ్యులు గురుగుబెల్లి మురళీ, చౌదాల గోవిందరావు, బలివాడ మహేష్, పేడాడ బాబూరావు పాల్గొన్నారు.

అలుపెరుగని పోరాటం

- ఎటూ తేల్చని కమిషన్లు
- ఉప ముఖ్యమంత్రిపైనే ఆశలు
- 300 రోజులకు చేరుకున్న బెంతు ఒరియాల దీక్షలు


దీక్షలో పాల్గొన్న తులసిగాం గ్రామస్తులు

ప్రజాశక్తి- కవిటి

పూర్తిస్థాయిలో తరగతి, ఉప తరగతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ ధ్రువపత్రం (నివాసం, కులం, పుట్టిన తేదీతో కూడిన ధ్రువీకరణ పత్రం) మంజూరు చేయాలని కోరుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గం బెంతు ఒరియాలు కవిటి బస్టాండ్ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈ దీక్షలు సోమవారం నాటికి 300 రోజుకు చేరుకున్నాయి. డిసెంబరు 28, 2023లో ప్రారంభించిన ఈ రిలే నిరాహార దీక్షలు ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని నిర్విరామంగా కొనసాగడంలో బెంతు ఒరియాల యువత కీలక పాత్ర పోషించిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

ఎస్‌టి ధ్రువపత్రం కావాలంటూ...

కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లో నివసిస్తున్న పురియా, జన్నా, సాహు, మజ్జి, దొలాయి, బిసాయి, కొన్నాయి అనే ఇంటి పేరుతో ఉన్న బెంతు ఒరియా ప్రజలకు 1976 నుంచి 2003 వరకు ఎస్‌టి తరగతి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేవారిని రిలే నిరాహార దీక్ష పోరాట సభ్యులు అంటున్నారు. కానీ, ఎక్కడో సంతబొమ్మాళి మండలంలో బెంతు ఒరియా కానీ వారు బెంతు ఒరియాల పేరుతో తప్పుడు ఎస్‌టి ధ్రువపత్రం తీసుకోవడంతో అకారణంగా తాము అన్యాయానికి గురయ్యామని వీరు వాపోతున్నారు. ఆ తరువాత 2017 నుంచి 2023 జనవరి వరకు ఆన్‌లైన్‌లో తమకు ఇంటిగ్రేటెడ్ ధ్రువపత్రం జారీ చేసే వారిని కానీ, గత 21 నెలలుగా అవీ నిలిపివేయడంతో తమ విద్యార్థులకు, యువతకు మొత్తంగా తమ వ్యవస్థకే సమస్యలు మొదలయ్యాయని వీరు కన్నీరు మున్నీరవుతున్నారు.

పలుమార్లు కమిషన్

మరోవైపు బెంతు ఒరియాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే పలు కమిషన్లు వేసింది. 2008లో మహాత్మా గాంధీ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ సోషల్ యాక్టివిస్ట్, ప్రముఖ మానవ శాస్త్రవేత్త ఎస్.ఎన్.రథ ఆధ్వర్యాన కమిషన్ వేశారు. ఆ తర్వాత 2017లో విశాఖపట్నం ఆంధ్రా యూనివర్శిటీ ఆంధ్రోపాలజీ హెచ్‌ఒడి పీడీ సత్యపాల్ ఆధ్వర్యాన మరో కమిటీ వేశారు. ఆ తర్వాత 2019 సెప్టెంబరులో విశ్రాంత ఐఎఎస్ అధికారి జేసి శర్మ నేతృత్వంలో వన్ మ్యాన్ కమిషన్, 2022 అక్టోబరులో విశ్రాంత ఐఎఎస్ ఐ.శ్యాముల్ ఆనంద్ నేతృత్వంలో మరోసారి వన్ మ్యాన్ కమిషన్ ఏర్పాటు చేశారు. అయితే ప్రభుత్వాలు మారినప్పుడల్లా కమిషన్లు మారాయే తప్ప బెంతు ఒరియాలకు జరిగింది శూన్యం. ఆ కమిషన్లు అసలు నివేదికలు రూపొందించాయా? రూపొందిస్తే అందులో ఏయే విషయాలు పొందుపరిచాయి? అనే అంశాలు ఇప్పటికీ బహిర్గతం చేయలేదు.

వేయికళ్లతో ఎదురుచూపులు

దశాబ్దాలుగా తరగతి ధ్రువీకరణ పత్రాల కోసం పోరాడుతున్న బెంతు ఒరియాలు ఓ విధంగా ప్రస్తుతం అలసిపోయారు. అయితే ఇటువంటి పరిస్థితుల్లో ముందుకు వచ్చిన యువత దృఢనిశ్చయంతో ముందుకు సాగుతోంది. అందుకు నిదర్శనమే 300ల రోజులకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలు. అయితే తామెంత పోరాడిన ప్రభుత్వం సహకరించకపోతే చేసేది లేదని గుర్తించిన వారు ప్రస్తుతం తమ ఆశలన్నీ జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పైనే పెట్టుకున్నారు. గత కొన్నేళ్లుగా పలు బహిరంగ సభలు, ఎన్నికల సభల్లో మాట్లాడిన పవన్‌కళ్యాణ్ బెంతు ఒరియాల సమస్యల గురించి ప్రస్తావించారు. వారికి న్యాయం చేయాలని ఆకాంక్షించారు. అందులో భాగంగా మిణుకు మిణుకు మంటున్న తమ ఆశలకు పవన్ కళ్యాణ్ ఊపిరి పోస్తారని బెంతు ఒరియాలు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు.


దీక్షల్లో పాల్గొన్న యువత (ఫైల్)


నరసన్నపేట : శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

నరసన్నపేట: పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు భాగంగా నరసన్నపేట పట్టణం, బండి వీధిలో ఉపాధి హామీ పథకం కింద రూ.1,22,50తో 16 సిసి రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, కాలువలను నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. గత వైసిపి పాలనలో అభివృద్ధి పడకేసిందన్నారు. ఎంపిడిఒ, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పాతపట్నం : టిడిపి కూటమి ప్రభుత్వం గ్రామాల్లో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించి వారం రోజుల్లో పంచాయతీలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని తామర, తీమార గ్రామాల్లో ఆదివారం బిటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

పలాస : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని లొద్దభద్ర, రాజగోపాలపురం, మాకన్నపల్లి గ్రామాల్లో రూ. 66 లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, కుత్తుం లక్ష్మణ్ కుమార్, ఎంపిడిఒ వసంతకుమార్, మండల పంచాయతీ విస్తీర్ణాధికారి మెట్ట వైకుంఠరావు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని ఇర్రపడుగూడ, మతాల, గొట్టిపల్లె, బూతలగూడ, లబ్బ గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి ఎంపిపి సవర సావిత్రి, వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నీరజ, టిడిపి నాయకులు మాతల గాంధీ, కె.సంజీవరావు, ఎల్.తాతబాబు, ఎ.మాధవరావు, సర్పంచ్‌లు ఎస్.ఫల్గుణరావు, కళావతి, పి. రామ్మోహన్, ఎం.కృష్ణ, రాము, కె.తిరుపతిరావు పాల్గొన్నారు.

మందస : పల్లెల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందసలో పలు రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. టిడిపి మండల అధ్యక్షులు భావన దుర్యోధన, మాజీ ఎంపిపి దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పోలాకి : మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమని జడూరు ఎంపిటిసి గొండు చైతన్య అన్నారు. మండలంలోని జడూరులో పల్లె పండగలో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి గొండు మురళి, కృష్ణ పాల్గొన్నారు.

లావేరు: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్య దొర అన్నారు మండల కేంద్రంలో పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా సిసిరోడ్లు, కాలువ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లంకలపల్లి జగ్గన్న, దొర శ్రీనువాసరావు, మాకన శంకరరావు, ఎల్. ఆనందరావు, పి వెంకన్న, గురిజా శ్రీనివాసరావు, కార్యదర్శి పాల్గొన్నారు.


మంత్రికి ఆర్థికసాయం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

‘అన్న క్యాంటీన్’కు ఆర్థికసాయం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

టెక్కలి, కోటబొమ్మాళి మండల కేంద్రాల్లో పేదవాడికి రూ.5లకే నాణ్యమైన భోజనం అందిస్తున్న అన్న క్యాంటీన్‌కు ఎన్‌టిఆర్, మోక్షిజ్ఞ సేవా సంఘం ప్రతినిధులు రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు నిమ్మాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఆదివారం చెక్కును అందజేశారు. దాతలు ముందుకొచ్చి ఆర్థికసాయం అందజేస్తే మరింత మంది పేదలకు నాణ్యమైన భోజన అందిస్తామని మంత్రి తెలిపారు. అనంతరం ఎన్‌టిఆర్, మోక్షిజ్ఞ సేవా సంఘం ప్రతినిధులకు అభినందనలు తెలిపారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

అంగన్వాడీ భవనం ప్రారంభం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

టిడిపి కూటమి ప్రభుత్వం గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని భావనాపురం అంగన్వాడీ కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. అంతకుముందు సిరియాకండి, పద్మ, గొడ్డ, పెద్దపద్మాపురం గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండగలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహం ప్రసాద్ పండా, మాజీ ఎంపిపి ఎస్.మోహనరావు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్‌రెడ్డి, నంబాల వెంకటరావు, చాపర మాధవరావు, మాలతి శ్రీధర్ పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయం సందర్శన

టెక్కలి రూరల్ : మండలంలోని రావివలస ఎండల మల్లికార్జునస్వామి ఆలయంలో కార్తీక సోమవారం వచ్చే యాత్రికులకు ఏర్పాట్లు చేయాలని ఆర్‌డిఒ ఎన్.కృష్ణమూర్తి దేవాదాయశాఖ అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఆలయాన్ని సందర్శించి ఇఒ వి.రాధాకృష్ణతో మాట్లాడారు. కార్తీకమాసం ఉత్సవాల్లో యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా క్యూ లైన్లు, తాగునీరు, వైద్య సౌకర్యాలు, పారిశుధ్యం, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

గిట్టుబాటు ధరకు పోరాటం



మందస: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే వరకు పోరాటం సాగిస్తామని రైతాంగ సాధన కమిటీ అధ్యక్షులు మామిడి మాధవరావు స్పష్టం చేశారు. మండలంలోని హరిపురంలో ఆదివారం రైతు వ్యవసాయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస నియోజకవర్గ పరిధిలో అనేక జీవ నదులు ఉన్నా పాలకులు నిర్లక్ష్యంతో రైతులకు సాగునీరు అందడం లేదని అన్నారు. సమావేశంలో మహేంద్ర రైతు సంఘం అధ్యక్షులు బెస్త కామేశ్వరరావు, వ్యవసాయ ఆర్థిక నిపుణులు కన్నెగంటి రవి, కె.అన్నపూర్ణ, పేడాడ కృష్ణారావు, ముకుందరావు, దుర్యోధన పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయి వైద్యసేవలందించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కిడ్నీసంబంధిత వైద్యానికి సంబంధించి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని జిల్లాలో అందుబాటులోకి తేవడం శుభపరిణామని, హరిప్రసాద్ కిడ్నీ ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందజేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆకాంక్షించారు. నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి రోడ్డులో హరిప్రసాద్ కిడ్నీ సెంటర్‌ను ఎమ్మెల్యే శంకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అధిక శాతం మంది కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారని, వారు అత్యాధునిక, అత్యవసర వైద్యం కోసం విశాఖపట్నం, విజయవాడ వంటి ప్రాంతాలకు వెళ్లకుండా నగరంలోనే వైద్యసేవలు అందించే లక్ష్యంతో హరిప్రసాద్ కిడ్నీ సెంటర్ ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. కిడ్నీ చికిత్సల అనంతరం రోగుల రికవరీ రేటు కూడా చాలా బాగుందని డాక్టర్ దానేటి శ్రీధర్ పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీలో ఉచిత సేవలతో పాటు ఇతర రోగులకు రాయితీలు అందజేసి అందరి మన్ననలు పొందాలని సూచించారు. ఆస్పత్రి అధినేత, ప్రముఖ యురాలజిస్ట్, ఆండ్రాలజిస్ట్ డాక్టర్ దుంపల హరిప్రసాద్ మాట్లాడుతూ తన ఎదుగుదలకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో గడచిన 15ఏళ్లుగా వైద్యసేవలు అందిస్తున్నట్టు తెలిపారు. కిడ్నీ సెంటర్‌లో నెఫ్రాలజీ, యూరాలజీ రోగులకు పూర్తి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సిటీస్కాన్, తూలియమ్ లేజర్ మిషన్ అందుబాటులో ఉంచామన్నారు. జిల్లా ప్రజలు సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.


కిడ్నీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కళా సాహిత్య రంగానికి రాములు ఎంపిక

ఆమదాలవలస: కళా సాహిత్య రంగానికి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.ఎ.రాములు ఎంపికయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో 28 ప్రపంచ రికార్డులతో నిర్వహిస్తున్న తెలుగు సాహితీ జాతరలో ఈ అవార్డు వరించింది. సాహిత్య చరిత్రలో నిరంతరాయంగా ఈ నెల 19 నుంచి 20 వరకు గజల్స్ పాటలు, జానపద గీతాలు, డప్పు, ఫ్లూటు, మౌత్ ఆర్గాన్ వంటి వాయిద్య పరికరాలతో సుమారు 550 మంది కవులు, కళాకారులు, సాహితీవేత్తల మధ్య విన్నూతన ప్రదర్శనలతో అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ టి. పార్థసారథి చేతులమీదుగా ప్రశంసా పత్రం, మెమొంటో, వరల్డ్ రికార్డ్ పత్రం, సాలువుతో సత్కరించారు. ఈయన గతంలో అనంతపురం జిల్లాలో 33 గంటల 44 నిమిషాల 55 సెకండ్లు భారత్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, తానా బుక్ ఆఫ్ రికార్డు, ఎన్‌టిఆర్ బుక్ ఆఫ్ రికార్డ్ వరల్డ్, ఐదు ప్రపంచ రికార్డులు తన పేరును నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం శ్రీశ్రీ కళా వేదిక ప్రపంచ తెలుగు సాహితి కళా జాతరలో వరల్డ్ రికార్డు తన పేరున నమోదు చేసుకున్నారు. ఇటువంటి అద్భుతమైన ఘనత సాధించినందుకు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, ఎస్‌ఎంసి కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.


ప్రశంసాపత్రం, మెమొంటో అందుకుంటున్న రాములు


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని బడేనరసాపురానికి చెందిన పొన్నాన శ్రీను ఇటీవల మృతి చెందడంతో అందరినీ శోకసముద్రంలో ముంచేసింది. ఒక ఏడాది ఇంట్లో పెద్ద దిక్కు అయిన వారి తండ్రి, పెద్ద కుమారుడు శ్రీను మృతితో వారి కుటుంబానికి ఎవరూ పూడ్చ లేని లోటు మిగిల్చింది. అటువంటి కుటుంబానికి కొంత సహాయం చేయాలనే దృక్పథంతో స్నేహితులు ఆదివారం రూ.18,116 తల్లి మణికి కెపి స్పందన ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. ఈ మొత్తంలో సర్పంచ్ దుక్క భూషణ్‌రెడ్డి తన వంతు సాయంగా రూ.పది వేలు, బడే శ్రీనివాస్‌రెడ్డి రూ.2,116, మిగతాది స్నేహితులు సమకూర్చారు. కార్రృమంలో నరసాపురం సర్పంచ్ దుక్క భూషణ్ రెడ్డి, స్పందన ఫౌండేషన్ అధ్యక్షులు షణ్ముఖ మాస్టర్, సభ్యులు శివారెడ్డి, భానురెడ్డి, సుందర్, రమణరెడ్డి, చందు పాల్గొన్నారు.

ఎ- గ్రేడ్ మోడల్ పద్ధతిలో పంటల సాగు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా చేపేనపేట క్లస్టర్ పరిధిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులతో పది ఎకరాల్లో ఎ గ్రేడ్ కాంపాక్ట్ బ్లాక్ మోడల్ సాగును నిర్వహిస్తున్నారు. పలు పంటల సాగు, పంటల్లో జీవ వైవిధ్యత ఉండేలా క్షేత్రస్థాయిలో రైతులతో కలసి పనిచేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, డిజిటల్ యల్.టు సురేష్ మాట్లాడుతూ డి.పి.ఎం రేవతి ఆదేశాల మేరకు వరి సాగు చేసే రైతులకు అదనపు ఆదాయం వచ్చే విధంగా ఎ-గ్రేడ్ మోడల్ పద్ధతిలో పంటల సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. చేపేనపేటలో 8 మంది రైతులు 10 ఎకరాల్లో మోడల్ పద్ధతుల్లో వరిసాగు చేస్తున్నారన్నారు. ప్రధానంగా వరిసాగు చేస్తున్న పొలం గట్లుపై పలు రకాల కూరగాయలు సాగు చేసుకోవడం వలన రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. ఎ గ్రేడ్ మోడల్ విధానంలో వరిసాగులో రైతులకు అదనపు ఆదాయం లభిస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

ఎచ్చెర్ల: రుప్పపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో తక్కువ స్థలంలో వివిధ రకాల కూరగాయల పంటలను సాగు చేసుకోవాలని, ఈ విధంగా చేయడం వలన ఇంటి అవసరాలకు సరిపడా స్వచ్ఛమైన కూరగాయలు లభించడంతో పాటు ఆరోగ్యాలు కూడా మెరుగుపడతాయని తెలిపారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల ప్రాంగణంలో కూరగాయల విత్తనాలను మోడల్ పద్ధతిలో వేయించారు. ప్రతిఒక్కరూ పెరటి తోటలు పెంపకం చేపట్టాలన్నారు. ఆత్మ పిడి పాపి నాయుడు, అంగన్వాడీ కార్యకర్తలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూర్యనారాయణ, అప్పల నరసయ్య, ధనలక్ష్మి పాల్గొన్నారు.


ఆమదాలవలస : వరి పొలం గట్టుపై పండిస్తున్న కూరగాయలు


వివరాలను వెల్లడిస్తున్న సిఐ మంగరాజు

బంగారం చోరీ నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి- సోంపేట

తాళం వేసిన ఇళ్లల్లో తాళం పగలగొట్టి దొంగతనాలకు పాల్పడిన సంఘటనపై మందస పోలీస్‌స్టేషన్లో నమోదైన కేసులో నిందితుడిని ఆదివారం అరెస్టు చేసినట్లు సోంపేట సిఐ మంగరాజు తెలిపారు. ఈ మేరకు విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. సోంపేట పట్నంలోని చిన్నకోమటి వీధికి చెందిన కోల కిరణ్ పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడని అన్నారు. పేకాటకు అలవాటై సులువైన మార్గంలో డబ్బులు సంపాదించేందుకు చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు గతంలో మందసలోని పలు ఇళ్లల్లో దొంగతనానికి పాల్పడినట్లు వివరించారు. తన నివసిస్తున్న చిన్నకోమటి వీధిలోని తన స్నేహితుడు ఇంట్లోనే ఇటీవల బీరువా తాళం పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డాడని అన్నారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి కిరణ్‌ను పట్టుకున్నట్టు తెలిపారు. అతని వద్ద నుంచి రూ.2 లక్షల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిని పట్టుకోవడంలో చురుగ్గా వ్యవహరించిన సిఐ మంగరాజుని, ఎస్ఐ హైమావతిని, సిబ్బందిని ఎస్‌పి మహేశ్వర రెడ్డి అభినందించారు.

వ్యక్తి అరెస్టు

నందిగాం : మండలంలోని పెద్దినాయుడుపేటకు టి.భువనేశ్వర్‌ను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ షేక్ మహమ్మద్ తెలిపారు. భవనేశ్వర్ అదే గ్రామానికి చెందిన వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడిన కేసులో అరెస్టు చేసినట్లు తెలిపారు.

మాధురికి నోటీసులు

టెక్కలి రూరల్ : టెక్కలి అక్కువరం సమీపంలో వైసిపి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ స్నేహితురాలు దివ్వెల మాధురికి ఆదివారం తిరుపతి పోలీసులు నోటీసులు అందించారు. తిరుమల మాడు వీధుల్లో ఫొటో షూట్, రీల్స్ చేశారని టిడిపి అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొద్ది రోజుల క్రితం తిరుపతి పోలీసులు మాధురిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఆదివారం టెక్కలిలో మాధురికి నోటీసులు అందించారు. దీంతో దువ్వాడ శ్రీనివాస్, మాధురి అంశం మరలా రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది.

రీ సర్వే సమస్యలపై గ్రామసభలు

లావేరు : మండలంలో గతంలో 18 గ్రామాల్లో భూముల రీ సర్వే జరిగిన వాటిపై సమస్యలు ఉంటే పరిష్కరించడానికి ప్రభుత్వం ఈ నెల 22 నుంచి గ్రామసభలు నిర్వహించాలని ఆదేశించిందని తహశీల్దార్ ఎన్ని జోగారావు తెలిపారు. రీసర్వే సమస్యలున్న రైతులు గ్రామసభల్లో దరఖాస్తులు చేసుకొని పరిష్కరించు కోవాలన్నారు. అక్టోబర్ 22న ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు వేణుగోపాలపురం, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నాగంపాళెం, 23న బుడతవలసలో 10 నుంచి సాయంత్రం 5 వరకు, 24న సిగురు కొత్తపల్లి, వెంకటరావు పేట, 25న లోపెంట, 26న కొండకుంకం, 28న గోవిందపురం, 29న భరనికాం, 30న లింగాలవలస, నవంబర్ 1న పోతయ్యవలస, 2న కేశవరాయపురం, జిజివలస, 4న సుభద్రాపురం, చెల్లయ్యమ్మ అగ్రహారం, 5న రావివలస, చిర్లపాళెం గ్రామాల్లో రిసర్వే సమస్యలపై గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రిసర్వే డిప్యూటీ తహశీల్దార్ డి.తిరుపతిరావు తెలిపారు.

హిందీమంచ్ కార్యదర్శిగా రామారావు

రణస్థలం రూరల్ : హిందీ మంచ్ సంస్థ జిల్లా సంఘటన్ కార్యదర్శిగా రొంపివలస రామారావు ఎన్నికయ్యారు. ఆదివారం మధ్యాహ్నం జిల్లా కేంద్రంలో జరిగిన హిందీ మంచ్ సంస్థ జిల్లాశాఖ సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రం వెంకటేశ్వరా కాలనీకి చెందిన రామారావు లావేరు మండలం బెజ్జిపురం హైస్కూల్‌లో హిందీ పండిట్‌గా పని చేస్తున్నారు. గత 20 ఏళ్లుగా హిందీ భాష ప్రచారానికి కృషి చేస్తున్నారు. హిందీ దివాస్ సందర్భంగా ఉత్తమ హిందీ ప్రచారక్‌గా శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ చేతులమీదుగా సత్కారం పొందారు. రామారావును విశ్రాంతి డిఇఒ బలివాడ మల్లేశ్వరరావు, కాస్మో పోలిటన్ క్లబ్ జిల్లా కార్యదర్శి సురంగి మోహనరావు, హిందీ మంచ్ జోనల్ కార్యదర్శి కోనే శ్రీధర్ తదితరులు అభినందించారు.

పాతపట్నంలో భారీ వర్షం

పాతపట్నం : మండలంలోని కొరసవాడ, బూరగాం, ప్రహ రాజపాలెం, పాతపట్నం తదితర ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్న ఒంటి గంట నుంచి భారీగా వర్షం కురిసింది. దీంతో రోడ్లపై నీరు నిల్వ ఉండేలా కుండ పోత వర్షం పడింది. సుమారు గంటకు పైబడి ఏక ధాటిగా వర్షం కురవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. రోడ్లన్నీ జలమయమయ్యాయి. కాలువల్లోని మురుగునీరు రోడ్ల ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేయడంతో ఇబ్బందులు పడ్డారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

లావేరు: ప్రతి విద్యార్థి పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులు వివిధ రకాలైన పుస్తకాలను చదువుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి శనివారం వరకు విద్యార్థులందరూ పాఠశాలలలోనే క్లాస్ పుస్తకాలు చదువుతుంటున్నారని తెలిపారు.